క్లుప్తంగా

నాణ్యమైన వైద్య సేవలందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ

ఇల్లంతకుంట: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవ లందించాలని ఎంపీపీ వెంకటరమణారెడ్డి అన్నారు. స్థానిక పీహెచ్‌సీని గురువారం సందర్శించి వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశంలో మాట్లాడారు. రోజువారి ఓపీ పేషంట్ల సంఖ్య పెరిగిందని, దీంతో పాటు సుఖప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. ఆస్పత్రిలో అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కృషి చేస్తున్నారని, త్వరలోనే నూతన భవనాన్ని నిర్మిస్తామన్నారు. వైద్యాధికారులు శరణ్య, రమేశ్, ఏపీఎం వాణి, సర్పంచులు భాగ్యలక్ష్మి, కట్ల వెంకట్‌రెడ్డి, తూంకుంట శ్రీలత, చింతలపెల్లి శ్రీలత, ఎంపీటీసీలు పుష్పలత, స్వప్న, స్రవంతి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



తనిఖీ చేస్తున్న ఏవో సందీప్

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మండల పరిధిలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను మండల వ్యవసాయాధికారి సందీప్ గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్, ఎరువులు అమ్మకాలకు సంబంధించి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, స్టాక్ రిజిస్టర్, ఎరువుల అమ్మకపు సంబంధించిన వివరాలను సరిగా నమోదు చేయాలని నిర్వాహకులకు సూచించారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విత్తనాలు, ఎరువులు కొన్న రైతులు రశీదులు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

శ్రమదానంతో మరమ్మతు



వంతెన వద్ద మట్టిపోస్తున్న ఆటో యూనియన్ సభ్యులు

కోనరావుపేట: పగుళ్లు ఏర్పడి, గుంతలతో ఉన్న వంతెనకు ఆటో యూనియన్ సభ్యులు శ్రమదానంతో మరమ్మతు చేశారు. కోనరావుపేట మండలం సుద్దాల–మారుపాక గ్రామాల మధ్య ఉన్న వంతెనకు ఇరువైపులా రహదారి కుంగిపోయింది. వంతెన గోడలు పగుళ్లు బారుతుండడంతో వాహనాల రాకపోకలకు కొన్ని నెలలుగా ఇబ్బంది అవుతోంది. మరమ్మతులు చేపడుతామని చెబుతున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడంతో సుద్దాల ఆటో యూనియన్ సభ్యులు ముందుకొచ్చి వంతెనకు ఇరువైపులా మట్టిని పోసి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

ఏం కొనేటట్టు లేదు..

- కూరగాయల ధరలకు రెక్కలు
- కిలో టమాట రూ.100
- కిలో పచ్చిమిర్చి రూ.120
- దిగుబడి పడిపోవడమే కారణం

కూరగాయల ధరలు ఇలా..

(కిలోకు..రూ.లలో)

టమాట	100
పచ్చిమిర్చి	120
గోరుచిక్కుడు	100
చిక్కుడు	100
అలసంద	80
క్యారెట్	80
బీరకాయ	80
వంకాయ	60
ఆకుకూరలు	80
కాకర	80
బెండకాయ	80
మునగకాయ	60
సోరకాయ ఒకటి	30



కూరగాయలు కొంటున్న వినియోగదారులు

ఇల్లంతకుంట: 'ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు..' అనే సినిమా పాట ప్రస్తుతం ఉన్న కూరగాయల ధరలు చూస్తే సరిగ్గా సరిపోతుంది. వారం రోజులుగా కూరగాయల ధరు తగ్గేదే లే.. అన్నట్టుగా నిత్యం పెరిగిపోతూనే ఉన్నాయి. కిలో టమాట రూ.100 ఆపైనే పలుకుతోంది. పచ్చిమిర్చి కిలోకు రూ.120 చేరింది. ఇలా ఏం కొనాలన్నా సామాన్యుల జేబులు ఖాళీ అయ్యేలా ఉంది.

తగ్గిన సాగు విస్తీర్ణం

జిల్లా వ్యాప్తంగా 1400 ఎకరాల్లో కూరగాయలు సాగయ్యేవి. కానీ ఈ వేసవిలో జిల్లాలో వాతావరణం కూరగాయల సాగుకు అనుకూలంగా లేదు. దీంతో వంద ఎకరాలకే కూరగాయల సాగు పరిమితమైంది. సాగు చేసిన తోటలు సైతం తీవ్ర ఎండలకు ఎండిపోయాయి. రాళ్లవానతో టమాట తోటలు పాడయ్యాయి.

దూరప్రాంతాల నుంచి..

జిల్లాలో కూరగాయల ఉత్పత్తి అంతంతే ఉండడంతో సిరిసిల్ల మార్కెట్‌కు ఆంధ్రప్రదేశ్‌లోని మదనపల్లి, చింతామణి మార్కెట్లతోపాటు హైదరాబాద్, మహారాష్ట్ర వంటి ప్రాంతాల నుంచి టమాట, క్యాప్సికం, బీర, సొర, గోరుచిక్కుడు, పచ్చిమిర్చి దిగుమతి చేసుకుంటున్నారు. దూరప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటుండడంతో ధరలు అమాంత పెరిగిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లా రైతులు సాగు చేసిన పంటలు చేతికొస్తే ధరలు తగ్గే అవకాశం ఉందంటున్నారు.

ధరలు బాగా పెరిగాయి



కూరగాయల ధరలు బాగా పెరిగాయి. నెల రోజుల క్రితం రూ.200లు పెడితే వారానికి సరిపడ కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు కనీసం రెండు రోజులకు సరిపడేలా కూడా రావడం లేదు. టమాటతోపాటు అన్నీ కూరగాయల ధరలు పెరిగాయి.

– గన్నారం నర్సయ్య, పెద్దలింగాపూర్

ధరలు ఇలాగే ఉంటే కష్టం



కూరగాయల ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ఏది కొన్న కిలో వందకు తక్కువగా లేవు. టమాట, పచ్చిమిర్చి, ఇతర కూరగాయల ధరలన్నీ పెరిగాయి. కూరగాయల ధరల పెరుగుదలతో సామన్యులకు ఇబ్బందిగా ఉంది. కిలోకు బదులు పావుకిలోతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది.

– స్వప్న, రహీంఖాన్‌పేట

చెరువు నిండితే గండమే..



గత వర్షాకాలంలో చెరువు బ్యాక్ వాటర్‌తో మునిగిన పంట (ఫైల్)

సిరిసిల్లఅర్బన్: వర్షాకాలం వచ్చిందంటే చాలు సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు శివారులోని భావన్‌కుంట చెరువు కింది రైతులు ఆందోళనకు గురవుతారు. వరదలు వచ్చి చెరువు బ్యాక్ వాటర్‌లో తాము సాగు చేసుకుంటున్న పంటలు మునిగిపోతున్నాయని, ప్రతి ఏటా తాము నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరు శివారులోని భావన్‌కుంట చెరువు కింద సర్వే నెంబర్ 428, 429తో పలువురు రైతులకు దాదాపు 40 ఎకరాల పట్టా భూములున్నాయి. చెరువు కట్టపై మట్టిపోయడంతో ఎత్తు పెరిగి, తూములు సరిగా పనిచేయకపోవడంతో వర్షాకాలంలో వరదలు వచ్చినప్పుడల్లా ఆ రైతుల పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. సమస్య పరిష్కరించాలని గత వర్షాకాలం నుంచి సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముంపునకు గురవుతున్న పంటలు

చెరువు మత్తడి ఎత్తు తగ్గించి, తూముల మరమ్మతులు చేయాలని, తూము వద్ద మట్టిని తొలగించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నామమాత్రంగా వచ్చి వెళ్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదంటున్నారు. మళ్లీ వర్షాకాలం వచ్చిందని ఎలాంటి నష్టం జరగకముందే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చందుర్తి: మండల పరిధిలోగల మర్రిగడ్డ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు మల్లారం 133 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ లైన్ మరమ్మతు పనులు చేపట్టడంతో శుక్రవారం 7న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ రాకేశ్‌రెడ్డి తెలిపారు.

సమాచారం

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం

సిరిసిల్లఅర్బన్: ఎల్లారెడ్డిపేటలోని మహాత్మా జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాల(బాలుర)లో అడ్మిషన్ కొరకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డి. కృష్ణమూర్తి ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు సంబంధిత వైబ్‌సైట్‌లో కానీ, నేరుగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9381825642 నెంబర్‌ని సంప్రదించాలన్నారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్స్

గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కొరకు ఈనెల 11న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకన్న ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్ (బాలురు), సిరిసిల్ల(బాలికలు), మంథని(బాలికలు), వేములవాడ(బాలికలు) గురుకుల జూనియర్ కళాశాలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో తంగళ్లపల్లి మండలం సారంపల్లి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో హాజరుకావాలన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మహిళలకు కిట్లు అందిస్తున్న కౌన్సిలర్ మాధవి

సిరిసిల్లటౌన్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని 37వ వార్డు కౌన్సిలర్ దిడ్డి మాధవి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన ×విలేజ్ హెల్త్ శానిటేషన్ అండ్ న్యూట్రీషన్ డే(వీహెచ్ఎస్ఎన్‌డీ) కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, బరువు తక్కువ ఉన్న చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత శుభ్రతపై వివరిస్తూ పోషకాహార కిట్లు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్త సుధారాణి, ఆర్‌పీ రేఖ పాల్గొన్నారు.

రీడింగ్‌రూమ్‌కు పుస్తకాలు అందజేత

సాక్షి స్పందన



పుస్తకాలు అందజేస్తున్న సాహితీవేత్త అశోక్

ముస్తాబాద్: స్థానిక మేజర్ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన రీడింగ్ రూమ్‌కు రూ.15 వేల విలువైన పుస్తకాలు, గ్రంథాలను ప్రముఖ బాల సాహితీవేత్త, కవి, రచయిత గరిపెల్లి అశోక్ గురువారం అందజేశారు. గత నెల 30న సాక్షిలో ×పేరుకే రీడింగ్ రూమ్‌* శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన తన వంతుగా అన్ని రకాల పుస్తకాలు, గ్రంథాలను సర్పంచ్ గాండ్ల సుమతి, కార్యదర్శి రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆశయాల మేరకు విద్యార్థులు, సగటు పౌరుల్లో పుస్తక పఠనం పెంచేందుకు తమ వంతుగా రాబోవు రోజుల్లో మరిన్ని పుస్తకాలను, సాహిత్యానికి సంబంధించిన పత్రికలను పంపిస్తామన్నారు. తెలుగు సాహితీ అకాడమీ ద్వారా రూ.30 వేల విలువైన పుస్తకాలను త్వరలో రీడింగ్ రూమ్‌లో ఏర్పాటు చేసేలా చూస్తామన్నారు. అశోక్‌కు సర్పంచ్‌తో పాటు కార్యక్రమానికి హాజరైన మాజీ జెడ్పీటీసీ మేర్గు యాదగిరిగౌడ్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీనివాస్, శీలం స్వామి, నవాజ్, దేవేందర్, అన్వర్, కొడె శ్రీను, కృష్ణమూర్తి అభినందించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో సీఆర్ఆర్ నిధుల ద్వారా అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు గురువారం భూమి పూజ చేశారు. పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని పలువురు కోరారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, ఉపసర్పంచ్ బషీర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె



కోనరావుపేటలో..



చందుర్తిలో..



ముస్తాబాద్‌లో..



ఇల్లంతకుంటలో..



వీర్నపల్లిలో..

కోనరావుపేట/ముస్తాబాద్/చందుర్తి/ఇల్లంతకుంట/వీర్నపల్లి: తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల కార్మికులు గురువారం సమ్మెకు దిగారు. కోనరావుపేట మండల కేంద్రంలో కార్మికులు చేస్తున్న సమ్మెకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి మద్దతు ప్రకటించి మాట్లాడారు. జిల్లాలో 255 గ్రామాల్లో 1278 మంది కార్మికులు పనిచేస్తున్నారని అన్నారు. గతంలో సమ్మె చేసిన కార్మికులు సీఎం హామీతో విరమించారని, సీఎం హామీ ఇచ్చి 5 సంవత్సరాలు అవుతుందని ఇప్పటివరకు హామీలు నెరవేరలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చి కార్మికులు సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్మికులకు కనీస వేతనం కింద రూ.21,500 చెల్లించాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. వేతనాలను నేరుగా వారి ఖాతాల్లోనే జమచేయాలన్నారు. ముస్తాబాద్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్, చందుర్తిలో మల్యాల నర్సయ్య, ఇల్లంతకుంట ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్, ఎల్లారెడ్డిపేటలో సీఐటీయూ మండల అధ్యక్షుడు రేసు రాజయ్య, వీర్నపల్లిలో ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్ సమ్మెకు మద్దతు పలుకగా కార్మిక సంఘం అధ్యక్షులు లద్దురి నర్సయ్య, కార్యదర్శి శేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జూపల్లి మనోజ్ కుమార్‌తో పాటు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న మనోహర్‌రెడ్డి

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలోని మార్కండేయ, బ్రహ్మంగారి ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి రూ.20 వేల విరాళం గురువారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉరడి రాంరెడ్డి, ఉరడి ప్రవీణ్, రాజిరెడ్డి, భరత్, శ్రీనివాస్, ప్రవీణ్, గుండెల్లి రవి, రవీందర్, కాసర్ల అరుణ్, నర్సయ్య పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపుపై ఆగ్రహం



అధికారులను ప్రశ్నిస్తున్న సంగీతం శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్: స్థానిక గీతానగర్ చౌరస్తా వద్ద జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో యువ పోరాట యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది గురువారం తొలగించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనాథ్, చుక్కశేఖర్ అక్కడికి చేరుకున్నారు. పర్మిషన్ తీసుకోని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించడంపై ఏంటని ప్రశ్నిస్తూ మున్సిపల్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మున్సిపల్ అధికారులు బీఆర్ఎస్ కార్యకర్తల్లా పనిచేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి పర్యటన ఉన్నా అనుమతి తీసుకున్న వాటిని తొలగించడం పద్ధతి కాదన్నారు. మున్సిపల్ అధికారులు తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. సంఘటన స్థలానికి ఎస్ఐ శ్రీనానాయక్ చేరుకొని కాంగ్రెస్ నాయకులను శాంతింపజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

కోనరావుపేట: మండలం ధర్మారం గ్రామానికి చెందిన మైలారం నర్సయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే రమేశ్‌బాబు గురువారం పరామర్శించారు. గ్రామానికి చెందిన నర్సయ్య ఉపాధి నిమిత్తం బెహరాన్‌కు వెళ్లి అక్కడే గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీపీ చంద్రయ్య, సర్పంచుల ఫోరమ్ కన్వీనర్ పర్శరాములు, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ మహేశ్ పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి



దుమాలలో నివాళి అర్పిస్తున్న సర్పంచ్, తదితరులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాలలో గురువారం మాజీ ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కదిరె రజిత మాట్లాడుతూ ప్రధానిగా దేశానికి ఎన్నో గొప్ప సేవలు అందించారన్నారు. ఆయనను ఈ తరం ప్రజాప్రతినిధులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మహేందర్, సీసీ రమణ, సీఏ భాగ్యమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపిక



ఎంపికలో పాల్గొన్న విద్యార్థులు

బోయినపల్లి: హకీంపేట తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో 2023–2024 విద్యా సంవత్సరానికి గాను నాలుగు, ఐదో తరగతి ప్రవేశాల కోసం బోయినపల్లి హైస్కూల్ మైదానంలో గురువారం ఎంపిక పోటీలు నిర్వహించారు. 4వ తరగతిలో విశ్వతేజ, శ్రీరామ్, అవంతిక, రిషిత, అచ్యుత, మణి, వర్షిణి, 5వ తరగతి ప్రవేశాల కోసం సాకేత్, చరణ్‌తేజ, రిషిత్, హనునందిత జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంఈవో శ్రీనివాసదీక్షిత్ తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బోయినపల్లి పీడీ సీహెచ్. సంపత్‌రావు, పీఈటీలు, బోయిని సంతోష్, రమాదేవి విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విలాసాగర్ చెరువులోకి నీటి విడుదల



విడుదలైన నీటికి పూజలు చేస్తున్న నాయకులు

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామ పరిసరాల్లోని వరదకాలువ నుంచి గ్రామంలోని పెద్ద చెరువులోకి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గురువారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా నీటిని ఎత్తిపోసే మోటార్లను ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. వానాకాలం సీజన్‌లో విలాసాగర్ గ్రామంలోనీళ్లలేక నారుమళ్లు ఎండిపోతున్నాయని పలువురు రైతులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చెరువులో నీటిని ఎత్తిపోసేందుకు వీలుగా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా గతంలో ఏర్పాటు చేసిన మోటార్లను ప్రారంభించారు. అనంతరం విడుదలైన గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా ఉండేందుకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు జూలపల్లి స్వప్నాంజలి, ఒంటెల రాజగోపాల్ రెడ్డి, వైస్ఎంపీపీ నాగయ్య, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థినికి ఆర్థికసాయం

ఎల్లారెడ్డిపేట: మండలం వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బాసర ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన కెమ్మసారము తనుష్క ఉపాధ్యాయులు చేయూతను అందించారు. విద్యార్థిని తల్లిని ఘనంగా సత్కరించారు. గురువారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులంతా కలిసి తమ వంతుగా అడ్మిషన్ కోసం రూ.6 వేల నగదును అందజేశారు. ఉపాధ్యాయులు అందరికి స్ఫూర్తిగా నిలుస్తారని ఎంఈవో దూస రఘుపతి అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గొట్టిముక్కల శేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు

సిరిసిల్లఅర్బన్: మంత్రి కేటీఆర్ తంగళ్లపల్లిలోని జిల్లెల్ల శివారులోని వ్యవసాయ కళాశాలకు వస్తున్న సందర్భంగా బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు కోల ఆంజనేయులుతో పాటు పలువురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అక్రమ అరెస్టులను బీజేపీ నాయకులు ఖండించారు.

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామంలో మండల బీజేపీ నాయకుడు, ముంపు గ్రామాల ఐక్య వేదిక ఉపాధ్యక్షుడు కొండం శ్రీనివాసరెడ్డిని పోలీసులు గురువారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పచ్చిరొట్టతో జీవ లక్షణాలు వృద్ధి

బోయినపల్లి: చేలల్లో పచ్చిరొట్ట పంటలు కలియదున్నడం వల్ల నేలలో భౌతిక రసాయన లక్షణాలు వృద్ధి చెందుతాయని ఏవో ప్రణిత తెలిపారు. మండలంలోని కోరెంలో గీస దేవయ్య రైతు చేలో పచ్చిరొట్టను గురువారం పరిశీలించి మాట్లాడారు. పచ్చిరొట్టతో తక్కువ ఖర్చుతో నేలకు ఎక్కువ మోతాదులో సేంద్రీయ కర్బనం అందుతుందన్నారు. నేల గుల్ల బారుతుందని తెలిపారు. జీలుగ, పెసర పంటలను ఎక్కువగా పచ్చిరొట్ట పంటలుగా సాగు చేస్తారని తెలిపారు. చేలలో పచ్చిరొట్ట నాటి అనంతరం కలియదున్నితే తర్వాత వేసే పంటలు బాగా పండుతాయన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట: మండలంలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చౌదరి రాజశేఖర్ రూ.28 వేలు, ఒల్లాల మహేశ్ రూ.15 వేలు, కుమ్మరవేని రాజయ్య రూ.11 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం సర్పంచ్ శ్రీలత అందజేశారు.

సిరిసిల్లఅర్బన్: తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామంలో చౌదరి ముత్యం రూ.60 వేలు, స్వప్న రూ.20 వేలు, అశ్విని రూ.19 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. చొప్పున బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు పోన్నాల చక్రపాణి చెక్కులు పంపిణీ చేశారు.

పరామర్శ

కోనరావుపేట: మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన అమరం లక్ష్మారెడ్డి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి గురువారం పరామర్శించారు.